

## రోడ్డు పూర్తిచేయాలని వినతిపత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు

**మేడ్చల్ 26( నేటి ప్రస్థానం):** ఈరోజు మేడ్చల్ బిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ ఉమా నాగరాజు ముదిరాజ్ గారి ఆధ్వర్యంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులకు ఈటెల రాజేందర్ గారికి మెమొరండం ఇవ్వడం జరిగింది. మెమొరండంలో సారాంశం మేడ్చల్ ఎన్ హెచ్ 44 ఆగిపోయిన ఫ్లైఓవర్ పనులని పునర్ ప్రారంభించాలని మరి ముఖ్యంగా దెబ్బతిన్న జాతీయ రహదారి పై వాహనదారులు ఎదుర్కొన్న సమస్య మరియు దెబ్బతిన్న రోడ్డు వలన అనేకమంది మృత్యువాత పడ్డారని విషయం వివరిస్తూ మేడ్చల్ చెక్పోస్ట్ నుంచి అత్వెల్లి వరకు  గుంతల మయం అయిన రోడ్డుని నూతన రోడ్డు నిర్మించాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగరాజు ముదిరాజ్, లాయక్ అలీ, బాలరాజ్ ముదిరాజ్,బాల మల్లేష్ యాదవ్, మహేందర్ పాల్గొనడం జరిగింది.

## జనతా గ్యారేజ్ మెకానికల్ పాపగల మహేష్ జన్మదిన వేడుకలు





**యాదాద్రి భువనగిరి :** చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన జనతా గ్యారేజ్ మెకానికల్ పాపగల మహేష్ జన్మదిన వేడుకలను వారి మిత్ర బృందం ఘనంగా జన్మదిన వేడుకలను చౌటుప్పల్ లో నిర్వహించారు. అనంతరం ఆయనను సన్మానించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజు వేడులను మరెన్నో జరుపుకోవాలని మిత్ర బృందం శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వారి మిత్రులు ఆరెగూడెం ఉపసర్పంచ్ నిమ్మల సత్యనారాయణ గౌడ్, బిల్ల కంటి సుధీర్ కుమార్,యాట రమేష్, ఎల్లంకి వెంకటేష్, చిలువేరు శివకుమార్, రాపర్తి కరుణాకర్,రాచకొండ మనోజ్, , కస్తూరి లింగస్వామి, పిట్ట కృష్ణ,ఉప్పు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని యువకుడు మృతి, మరో ఇద్దరికి గాయాలు

**మిర్యాలగూడ, జులై 26:** మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ శివారు జంకుతండా ఎక్స్ రోడ్డు వద్ద ఆదివారం లారీ ఢీకొని బైక్ పై వెళ్తున్న ఓ యువకుడు మరణించగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని బాపూజీ నగర్ కు చెందిన గుడుగుంట్ల విజయ్ ప్రసాద్ (31) తన స్నేహితుడైన కొండ అజయ్ బైకుపై కోదాడ – జడ్చర్ల హైవేపై వెళ్తూ బైక్ నడుపుతున్న అజయ్ లారీని ఓవర్ టేక్ చేసి జంకుతండా వైపు వెళ్లేందుకు మలుపు తిరుగుతుండగా వెనక నుండి అతివేగంగా వచ్చిన లారీ బైకును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో విజయ్ ప్రసాద్ అక్కడికక్కడే మరణించగా, అజయ్, మరో యువకుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ గొల్ల ప్రకాష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ ఎం లక్ష్మయ్య తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు తీవ్ర దిగ్భ్రాంతి

**మిర్యాలగూడ: జూలై 26::** మిర్యాలగూడ పట్టణం బాపూజీ నగర్కు చెందిన గుడుగుంట్ల ప్రసాద్ వెంకటాద్రిపాలెం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం పట్ల మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్రావు తీవ్ర దిగ్భ్రాంతిని, ఆవేదనను వ్యక్తం చేశారు. లారీ ఢీకొన్న ప్రమాదంలో ప్రసాద్ అక్కడికక్కడే దుర్మరణం పాలుకావడం తనను ఎంతగానో కలచివేసిందని ఆయన పేర్కొన్నారు.ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే స్పందించిన మాజీ ఎమ్మెల్యే, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుడు గుడుగుంట్ల ప్రసాద్ భౌతికకాయాన్ని పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన గాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ప్రసాద్ కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.అదేవిధంగా, ఈ ప్రమాదంలో బైక్పై ఉండి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు వ్యక్తులను నల్లమోతు భాస్కర్రావు గారు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన, అత్యవసర వైద్యం అందించాలని, అవసరమైతే ఉన్నత చికిత్సకు ఏర్పాట్లు చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ మరియు వైద్య సిబ్బందిని ఆదేశించారు.వారి వెంట పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్ మొండి కత్తి లింగయ్య పేరుమల్ల ధనమ్మ దోరేపల్లి లింగయ్య ఏడుకొండలు సత్యనారాయణ మల్లేష్  తదితరులు ఉన్నారు..




# 261 భూముల లెక్కపై 'మిస్టరీ'.. తేలేదెప్పుడు?

**సీలింగ్ భూముల నుంచి పరిశ్రమల కొనుగోళ్ల వరకు.. 273 ఎకరాలపై కొనసాగుతున్న సందిగ్ధత**

**మాజీ సైనికులు, పేదల కేటాయింపులు.. తాజాగా 66 ఎకరాలకు భూసేకరణ నోటీసులు**

**గుమ్మడిదల, జూలై 26(నేటి ప్రస్థానం):** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలోని 261 సర్వే నంబర్ భూముల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఒకే సర్వే నంబర్లో పట్టా భూములు, సీలింగ్ భూములు, మాజీ సైనికులకు కేటాయింపులు, పేద రైతులకు పంపిణీ, ప్రభుత్వ అవసరాలకు భూముల కేటాయింపు, పరిశ్రమల కొనుగోళ్లు.. తాజాగా పారిశ్రామిక పార్కు కోసం భూసేకరణ నోటీసులు జారీ కావడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. దీంతో భూముల కేటాయింపు, స్వాధీనం, ప్రస్తుత హక్కులపై పూర్తి స్పష్టత ఎప్పుడు వస్తుందన్న ప్రశ్న స్థానికంగా వినిపిస్తోంది.

### 588 ఎకరాల్లో 273 ఎకరాలు సీలింగ్ భూములే..

అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం 261 సర్వే నంబర్లో మొత్తం 588 ఎకరాల భూమి ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో 315 ఎకరాలు పట్టా భూములు కాగా.. 273 ఎకరాలు సీలింగ్ చట్టం కింద ప్రభుత్వానికి వచ్చిన భూములుగా పేర్కొంటున్నారు. ఈ 273 ఎకరాల భూముల కేటాయింపులు, వినియోగం, ప్రస్తుత స్థితిపై పూర్తి స్థాయి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

### ప్రభుత్వ అవసరాలకూ భూముల కేటాయింపు..

ఇదే సీలింగ్ భూముల్లో ఇందిరమ్మ ఇళ్లకు 16 ఎకరాలు, కేసీఆర్ కాలనీకి 5 ఎకరాలు, డంపింగ్ యార్డుకు 3 ఎకరాలు, శ్మశానవాటికకు 1 ఎకరం, ఈద్గా కోసం 10 గుంటలు కేటాయించినట్లు స్థానికంగా వివరాలు ఉన్నాయి. అయితే ఇవన్నీ ఏ దశలో, ఏ ఉత్తర్వుల ప్రకారం కేటాయించబడ్డాయి? ప్రస్తుతం వాటి భౌతిక స్థితి ఏమిటన్నది స్పష్టత రావాల్సి ఉంది.

### బినామీ ఆరోపణలు.. ప్రహరీ గోడ తొలగింపు

ఇదిలా ఉండగా, కొన్ని భూములను బినామీ పేర్లతో ఆధీనంలోకి తీసుకున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పరిశ్రమ ప్రహరీ గోడ నిర్మాణంపై ఫిర్యాదులు రావడం, వాటి ఆధారంగా మున్సిపల్ అధికారులు ప్రహరీ గోడను తొలగించినట్లు సమాచారం. అయితే భూమి హక్కులు, నిర్మాణం జరిగిన స్థలం, సంబంధిత రికార్డులపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

### తాజాగా 66 ఎకరాలకు భూసేకరణ నోటీసులు..

ఇప్పటికే పలు వివాదాస్పద అంశాలతో చర్చలో ఉన్న 261 సర్వే నంబర్ భూములపై తాజాగా టీజీఐఐసీ పారిశ్రామిక పార్కు కోసం సుమారు 66 ఎకరాలకు ప్రాథమిక భూసేకరణ నోటీసులు జారీ కావడం మరో మలుపుగా మారింది. దీంతో పేద రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం తమకు కేటాయించిన భూములనే భూసేకరణ పరిధిలోకి తీసుకుంటుందా? లేక భూముల గుర్తింపు, రికార్డుల్లో వ్యత్యాసం ఉందా? అన్నదానిపై స్పష్టత కోరుతున్నారు.

### సమగ్ర సర్వేతోనే అసలు లెక్క తేలే అవకాశం

261 సర్వే నంబర్లోని 273 ఎకరాల సీలింగ్ భూములకు సంబంధించి కేటాయింపులు, స్వాధీనం, రద్దులు, ప్రభుత్వ అవసరాలకు వినియోగం, విక్రయాలు, ప్రస్తుత భౌతిక స్థితిపై సమగ్ర సర్వే నిర్వహిస్తేనే పూర్తి వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా పేదలు, మాజీ సైనికులకు కేటాయించిన భూములు ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి? పరిశ్రమలు కొనుగోలు చేసిన భూముల హక్కులు ఎలా ఏర్పడ్డాయి? భూసేకరణకు గుర్తించిన 66 ఎకరాల అసలు స్వరూపం ఏమిటి? అన్న అంశాలపై రెవెన్యూ యంత్రాంగం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. 261 సర్వే నంబర్లో ఎకరం ఎక్కడుంది.. ఎవరి పేరుపై ఉంది.. ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉంది? అనే లెక్క అధికారిక రికార్డులతో బయటకు వస్తేనే ఈ భూవ్యవహారంపై కొనసాగుతున్న సందిగ్ధతకు తెరపడే అవకాశం ఉంది.

### పరిశ్రమల కొనుగోళ్లతో మరో కోణం..

261 సర్వే నంబర్లోని 315 ఎకరాల పట్టా భూముల్లో ఒక ప్రముఖ పరిశ్రమ పట్టాదారుల నుంచి సుమారు 70 ఎకరాలు కొనుగోలు చేసినట్లు సమాచారం. అదే సమయంలో మాజీ సైనికులకు కేటాయించిన భూముల్లో 58.31 ఎకరాలు కొనుగోలు చేసినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నట్లు తెలుస్తోంది.అయితే మాజీ సైనికులకు కేటాయించిన కొన్ని భూములపై గతంలోనే రద్దు చర్యలు జరిగాయని రెవెన్యూ అధికారులు చెబుతున్న నేపథ్యంలో.. ఆయా భూములపై హక్కులు ఎలా ఏర్పడ్డాయి? కొనుగోళ్లు ఏ ఆధారాలతో జరిగాయి? అన్నది రికార్డుల పరిశీలనతో తేలాల్సి ఉంది. కొంతమంది మాజీ సైనికులు తమకు ఇప్పటివరకు భూమి స్వాధీనం కాలేదని చెబుతున్నట్లు సమాచారం కూడా ఈ వ్యవహారంపై మరిన్ని సందేహాలకు కారణమవుతోంది.

### మాజీ సైనికులకు 132.18 ఎకరాలు..

రికార్డుల ప్రకారం 1991లో 44 మంది మాజీ సైనికులకు 132.18 ఎకరాలు కేటాయించినట్లు సమాచారం. అనంతరం 92 మంది పేద రైతులకు 117 ఎకరాలు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. అయితే పేద రైతులకు కేటాయించిన భూమిలో సుమారు 66 ఎకరాలకే స్వాధీనం ఇచ్చారని, మిగిలిన భూమిపై స్పష్టత లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ అంశంపై అధికారిక రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను సరిపోల్చాల్సిన అవసరం ఉంది.



